దోస సాగు.. లాభాలు బాగు



దోసకాయలు కోస్తున్న రైతులు

- ఆశాజనకంగా మార్కెట్ ధర
- నరసాపురం మండలంలో విస్తారంగా సాగు

నరసాపురం రూరల్: తీరప్రాంతమైన నరసాపురం నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో విస్తారంగా కూరగాయల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం దోస రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. నరసాపురం మండలం పితానిమెరక, రుస్తుంబాద, యర్రంశెట్టివారి పాలెం, చామకూరిపాలెం, ఎల్బీచర్ల, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్లు తదితర గ్రామాల్లో దోస సాగు చేస్తున్నారు. ప్రకృతి అనుకూలించడంతో పంట దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంది. 10 కిలోల దోసకాయలకు హోల్‌సేల్ మార్కెట్లో రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలుకుతుంది. వేకువజామున నరసాపురం, తూర్పుతాళ్లు, సీతారామపురం తదితర ప్రాంతాల్లో జరిగే హోల్‌సేల్ మార్కెట్‌కు దోసకాయలను రైతులు తరలిస్తున్నారు. వేసవికాలం వచ్చేంత వరకు ఈ పంట దిగుబడి వస్తుంది. ఎకరం చేలో దోస సాగుకు రూ.10 వేలు నుంచి రూ.15 వేలు ఖర్చులు పోగా, రూ.30 వేల వరకు లాభం వస్తుందని రైతులు చెబుతున్నారు.

దిగుబడి బాగుంది



పితాని మెరకలో నాకున్న ఎకరం భూమిలో సర్వే పంటతో పాటు అంతర పంటగా దోససాగు చేస్తున్నాను. దిగుబడి బాగుంది. దోసకు మార్కెట్లో ధర కూడా ఆశాజనకంగా ఉంది. ధర ఇలాగే ఉంటే వచ్చే దిగుబడికి ఖర్చులు పోను లాభాలు వస్తాయి.

– గ్రంధి శ్రీనివాసు,
దోస రైతు, తెలగంశెట్టివారి మెరక

మొక్కల సంరక్షణ మరిచారా!



మిషన్ హైస్కూల్ రోడ్డులో డివైడర్ల మధ్య ఎండిపోతున్న మొక్కలు

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. దీంతో లక్షలు ఖర్చుపెట్టినా లక్ష్యం నెరవేరడంలేదు. నాలుగేళ్లుగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని మున్సిపాలిటీలో అట్టహాసంగా నిర్వహించారు. పలు దఫాలుగా పట్టణంలో మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను గాలికొదిలేశారు. ఫలితంగా గోదావరి గట్టు, వైఎన్ కళాశాల రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేషన్ రోడ్డు, మిషన్ హైస్కూల్ రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడంలేదు. దూడలు తినేయడం, నీరు వేయడం లాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో చచ్చిపోవడం జరిగింది. సాక్షాత్తు మునిసిపల్ కార్యాలయం ఆవరణలోని మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి. మొక్కల సంరక్షణపై ఇప్పటికైనా దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు



మాట్లాడుతున్న సీఐ యాదగిరి

నరసాపురం రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమనే ప్రయాణికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పనిచేయాలని నరసాపురం సీఐ బి.యాదగిరి అన్నారు. శుక్రవారం నరసాపురం ఆర్టీసీ డిపో వద్ద జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ ఎండీ ఆదేశాలకు అనుగుణంగా తామంతా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఫిబ్రవరి 15 వరకు ఈ మాసోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూలపల్లిలో ఆరోగ్య పోషణ దినోత్సవం



ఆరోగ్య పోషణ దినోత్సవంపై మాట్లాడుతున్న సత్యవేణి

పాలకొల్లు అర్బన్: గర్భనిర్ధారణ అయిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వులఖండం సత్యవేణి సూచించారు. మండలంలోని పూలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ ఆరోగ్య పోషణ దినోత్సవంపై శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ నుంచి ఇచ్చే ఆహారం వినియోగించుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన శిశువు జన్మించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఏఎన్ఎం విజయశాంతి, అంగన్‌వాడీ టీచర్లు అడబాల కనకదుర్గ, రజని, హేమలత, రూప, పద్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ దేవతల జాతర్లతో ఐక్యత



మావుళ్లమ్మ వారిని దర్శించుకున్న భక్తులు

పెనుగొండ: గ్రామ దేవతల జాతర్లు గ్రామస్తుల ఐక్యతను చాటుతాయని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సిద్ధాంతం శివారు నక్కవారిపాలెంలో మావుళ్లమ్మవారి జాతర ఉత్సవాలలో శుక్రవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నీటి సమస్యపై స్థానికులు ప్రస్తావించగా, దొంగరావిపాలెం వద్ద పంపింగ్ స్కీం ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్టు పితాని తెలిపారు. ఉదయం నుంచి మావుళ్లమ్మవారికి సామూహికంగా కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి), నక్కా గణపతి, దివి శేఖర్, బొబ్బిలి శ్రీనులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు



సిద్ధాంతంలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి గ్రామంలోని ప్రతి వీధిలోనూ దోమల నివారణ మందు పిచికారీ చేసినట్టు గ్రామ సర్పంచ్ చింతపల్లి గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వై కిషోర్ బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్ల పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ 3వ అదనపు జిల్లా జడ్జి ఎంఏ సోమశేఖర్ అధ్యక్షతన భీమవరం కోర్టు ప్రాంగణంలో శుక్రవారం అయిదుగురు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హెల్మెట్ల ఆవశ్యకతను వివరించారు. హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రమాదం జరిగినా ప్రాణాపాయం ఉండదని తెలిపారు. సామాజిక సేవా దృక్పథంతో హెల్మెట్లు పంపిణీకి ముందుకు వచ్చిన రిటైర్డ్ ఉద్యోగులు, సంస్థ పారా లీగల్ వలంటీర్లు అయిన షేక్ చాన్ బాషా, పి.సూర్యనారాయణలను ప్రత్యేకంగా అభినందించారు. పారా లీగల్ వలంటీర్ ఓ.చంద్రరావు హెల్మెట్లపై అవగాహన గీతాన్ని పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సురభి నాటక పోటీలు

ఉండి: ఈ నెల 20 నుంచి 23వ తేదీ బుధవారం వరకు సురభి నాటక పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని సంతాన గోపాలస్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నాటక పోటీల్లో నాలుగు అంశాలపై నాటకాలు ప్రదర్శించవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజు రాత్రి 7 గంటలకు నాటకాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఐసీసీ విజేత మేడపాడు టీం



ఐసీసీ విజేత మేడపాడు టీంకు ట్రోఫీని అందిస్తున్న అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత కుమార దత్తాత్రేయవర్మ

యలమంచిలి: ఇలపకుర్రు క్రికెట్ టోర్నమెంట్ (ఐసీసీ) ట్రోఫీని మేడపాడు టీం సాధించింది. సంక్రాంతి సందర్భంగా 10 రోజులుగా నిర్వహించిన ఈ టోర్నమెంటులో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. మేడపాడు, ఇలపకుర్రు జట్ల మధ్య శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇలపకుర్రు జట్టు 14 ఓవర్లలో 81 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మేడపాడు జట్టు 13.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి విజయం సాధించింది. విజేతలకు ట్రోఫీతోపాటు రూ.15 వేలు, రన్నర్స్‌కు ట్రోఫీతో పాటు రూ.10 వే అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా మేడపాడు ప్లేయర్ చీడే వెంకటేష్, బెస్ట్ బ్యాట్‌మెన్‌గా గంగులూరి కల్యాణ్, బెస్ట్ బౌలర్‌గా చీడే భాస్కర్‌లు నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేసిన టోర్నమెంట్ నిర్వాహకుడు, గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ మాట్లాడుతూ యువకులు జూద క్రీడల వైపుకు వెళ్లకూడదనే ఆశయంతోనే ఏటా ఇలపకుర్రులో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఆత్మీయ సమ్మేళనాల సందడి



1994-95 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెనుగొండ: సిద్ధాంతం జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాలతో సందడిగా మారింది. పాఠశాల ఆవరణలో శుక్రవారం 2003-04 సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఉత్సాహంగా నిర్వహించారు. చదువు నేర్పిన 20 మంది గురువులను ఘనంగా సత్కరించారు. పేద విద్యార్థులకు అండగా నిలవాలని, పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని తీర్మానించుకొన్నారు. సాయంత్రంవరకు ఆత్మీయతలను చాటుకొన్నారు.

సిద్ధాంతం లాకుల వద్ద ఉత్సాహంగా..

1994-95 విద్యా సంవత్సర విద్యార్థులు సిద్ధాంతం లాకుల వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 30 వసంతాలు నిండడంతో జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. కంచర్ల నరసింహమూర్తి (రాజా), తుమ్మల పల్లి గుప్త, మానేపల్లి కిషోర్ బాబు, మాటీవీ స్టార్ మా పరివార్ డైరెక్టరు భీముని కిషోర్, పితాని శేఖర్, నిట్టల కాశీ, నిట్టాల రమేష్, మద్దుల రాజా, ఆక్షింతలు సుబ్రహ్మణ్యం, డీవీ సత్యనారాయణ, చింతాకుల గోపాల కృష్ణ, నల్ల గీత, ఝాన్సీలు పాల్గొన్నారు.

21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు మండలపరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్ రవీంద్ర తెలిపారు. ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, ఇతర అంశాలపై చర్చ ఉంటుందని ఆయన శుక్రవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

జూదాలపై 56 కేసుల నమోదు

పాలకొల్లు అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా చట్ట విరుద్ధంగా పాలకొల్లు పట్టణ సర్కిల్ పరిధిలో కోడిపందేలు, పేకాట, గుండాటల నిర్వహణపై 11 కేసులు నమోదు చేశామని సీఐ కోలా రజనీకుమార్ తెలిపారు. 45 మందిని అదుపులోకి తీసుకున్నామని, రూ.33,161 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పాలకొల్లు రూరల్ సర్కిల్ పరిధిలో..

పోడూరు, యలమంచిలి, పాలకొల్లు మండలాల పరిధిలో 104 మందిని అదుపులోకి తీసుకుని 45 కేసులు నమోదు చేశామని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గుత్తుల శ్రీనివాస్ తెలిపారు. రూ.72,430 స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

రేపు సూపర్ సిటిజన్స్‌కి సత్కారం

పాలకొల్లు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక లయన్స్ కమ్యూనిటీ ఆడిటోరియంలో సూపర్ సీనియర్ సిటిజన్స్‌ని సత్కరించనున్నట్టు సంఘ అధ్యక్షుడు వంగా నరసింహరావు ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ సీనియర్ సిటిజన్స్ మాజీ ఎంపీ చేగొండి వెంకట హరరామజోగయ్య, మాజీ ఎమ్మెల్యేలు అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి)లను సత్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు తెలిపారు.

మందకొడిగా వరి నాట్లు



పెనుమంట్రలో నాట్లు వేస్తున్న కూలీలు

పెనుమంట్ర: మండలంలో దాళ్వా వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. సంక్రాంతి పండుగ నాటికి నాట్లన్నీ పూర్తయి కలుపుతీత పనులలో ఉండే రైతులు నేడు ఇంకా నారుమడులు, దమ్ము పనుల్లోనే ఉన్నారు. పెనుమంట్ర మండలంలో 12 వేల ఎకరాలకు పైగా చేలల్లో వరినాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 2 వేల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయి. మండలంలో 20 రోజుల కిందట నాట్లు ప్రారంభమయ్యాయి. ఎక్కువగా బెంగాలీ మగ కూలీలతో వరి నాట్లు వేయిస్తున్నారు. సార్వాలో కురిసిన భారీ వర్షాల ముంపు ప్రభావం దాళ్వాసాగుపై పడుతుందని దీనివల్ల నాట్లు ఆలస్యం అవుతున్నట్టు వ్యవసాయశాఖ అధికారిణి జోషుల తెలిపారు. ఇప్పటి వరకు 25 శాతం వరి నాట్లు పూర్తయ్యాయని, మరో 10రోజుల్లో వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని ఆమె వివరించారు.

పింఛన్ల తనిఖీ

కాళ్ల: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ లబ్ధిదారుల వివరాల తనిఖీని వైద్యుల బృందం శుక్రవారం చేపట్టినట్లు కాళ్ల మండలం ఎంపీడీఓ జి.స్వాతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఆరోగ్య పింఛన్ లబ్ధిదారుల తనిఖీలో భాగంగా మొదటి రోజు మండలంలోని 10 గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులను తనిఖీ చేసారని తెలిపారు. బొండాడ, బొండాడపేట, పెదఅమీరం, జక్కరం, కోపల్లె, కొలనపల్లి, ఎల్ఎన్ పురం, సీసలి, వేంపాడు గ్రామాల్లో వైద్య బృందం పర్యటించి మొత్తం 24 పెన్షన్లు తనిఖీ చేశారన్నారు. మిగిలిన గ్రామాలకు సంబంధించి శనివారం తనిఖీ చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో స్టేట్ టీమ్ డాక్టర్లు జి.రవికుమార్, సుహాస్ ఎస్ సునీల్, డి.సునీత, మెడికల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

నరసాపురం : తడి, పొడి చెత్తను మున్సిపల్ సిబ్బంది వేర్వేరుగా అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ప్రజలను కోరారు. సంపూర్ణ పారిశుద్ధ్యానికి, పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించకపోతే మున్సిపల్ సిబ్బంది సదరు చెత్తను తీసుకోరని, చెత్తను డ్రెయిన్లలో, రోడ్లపై వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

19న కార్మిక కర్షక ఐక్యత దినోత్సవం

భీమవరం: వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం ప్రజా సంఘాల కార్యాలయంలో జక్కం శెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. అన్ని పంటలకు రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇవ్వాలని కోరారు. అఖిలభారత కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 19వ తేదీన ప్రకాశం చౌక్ సెంటర్లో సభ జరుగుతుందని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎం ఆంజనేయులు ఎ అలమహారాజు ఇంజేటి శ్రీనివాస్‌పాల్గొన్నారు.

1 నుంచి సువార్త సభలు

ఉండి: కలిసిపూడి క్రీస్తు సంఘం చర్చి గ్రౌండ్‌లో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు రక్షణ సువార్త మహాసభలు నిర్వహిస్తున్నట్లు సభల కన్వీనర్ బ్రదర్ కె.సతీష్ శుక్రవారం తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం నిర్వహించే ఈ సభలకు ప్రసంగీకులుగా బ్రదర్ గ్రేస్ విక్టర్ (పాలచర్ల), డాక్టర్ కే ఉపేందర్ (ఖమ్మం), సిస్టర్ కాంతికళ (బలభద్రపురం) హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆరవల్లి వాసుల ఆరాధ్య దైవం యోగి వేమన



అత్తిలి మండలం ఆరవల్లిలో యోగివేమన విగ్రహం



ఆరవల్లిలో వేమన మందిరం

అత్తిలి: ఆరవల్లి ప్రజల ఆరాధ్యదైవం యోగి వేమన 100వ జయంతి ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సాధారణంగా సంక్రాంతి వచ్చిందంటే గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. కానీ ఆరవల్లి గ్రామస్తులకు జనవరి 18న నిర్వహించే వేమన జయంతే పెద్ద పండుగ. గ్రామానికి చెందిన దేశ విదేశాలకు వెళ్లినవారు. వృత్తి, ఉపాధిరీత్యా బయట ప్రాంతాలకు వెళ్లిన వారు వేమన జయంతి రోజున తప్పకుండా స్వగ్రామానికి చేరుకుంటారు. వేమన జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మహిళలు, పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మానవ జీవితానికి సంబంధించిన అనేక నిత్యసత్యాలను తనదైన శైలిలో తేట తెలుగు పదాలతో వర్ణించి, తెలుగువారి హృదయాల్లో శ్రీయోగివేమన చిరస్మరణీయునిగా నిలిచారు. పండిత, పామరులనే బేధం లేకుండా వేమన పద్యాలు వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. వేమనకు, ఈ గ్రామానికి చారిత్రకంగా ఎలాంటి సంబంధం లేకపోయినా ఆరవల్లి గ్రామ ప్రజలకు వేమన ఆరాధ్య దైవమయ్యారు. దీనిపై గ్రామస్తులు ఆసక్తికరమైన విషయం చెబుతారు. 1926కు ముందు గ్రామంలో ఏటా అగ్ని ప్రమాదాలు సంభవించేవి. అలాంటి పరిస్థితుల్లో గ్రామానికి చెందిన వి సత్యనారాయణరెడ్డి (దాసు) 1926 జనవరి 18న గ్రామంలో వేమన చిత్రపటాన్ని తాటాకు పందిరిలో ఉంచి పూజలు చేయడం ప్రారంభించారు. ఇలా చేయడంతో గ్రామంలో అగ్ని ప్రమాదాలు తగ్గిపోయాయట. అప్పటి నుంచి ప్రతి ఏటా జనవరి 18న వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా మారిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన యువత శ్రీయోగివేమన రెడ్డి యువజన సేవా సంఘాన్ని నెలకొల్పి పలు సేవా, అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకుంటున్నారు. ఈ గ్రామంలో యువకులు అధిక శాతం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తుంటారు.

కాలభైరవ సంతర్పణ...

వేమన జయంతి ఉత్సవాలలో భాగంగా ప్రతి ఏటా జనవరి 18న ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నసమారాధన నిర్వహిస్తారు. ఈ అన్నసమారాధన మనుషులకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామసింహాలైన శునకాలకు విస్తరాకులో ఆహార పదార్థాలను వడ్డించడం విశేషం. గ్రామానికి కాపలా ఉంటూ, గ్రామాన్ని రక్షించేది కాలభైరవుడని, ప్రతి ఏటా గ్రామంలో కాలభైరవ సంతర్పణ పేరుతో గ్రామంలో ఉన్న శునకాలకు భోజనం వడ్డిస్తామని శ్రీయోగివేమన జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి తెలిపారు.